క్లుప్తంగా

మహారుద్రాభిషేకం



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

కొత్తవలస: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వసంత విహార్‌లో వేద పండితులు బ్రహ్మశ్రీ అంపోలు ఉమా మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో సోమవారం మహారుద్రాభిషేకం నిర్వహించారు. శివలింగానికి భక్తులతో పంచామృతా భిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు.

ఎమ్మెల్సీ బొత్సతో సమావేశం



దత్తిరాజేరు మండల నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

దత్తిరాజేరు: ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను విజయనగరంలోని ఆయన నివాసంలో గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్యతో కలిసి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, నాయకులు మంత్రి అప్పల నా యుడు, కడుబండి రమేష్‌నాయుడు, తదితరులు ఎమ్మెల్సీ బొత్సతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

జర్నలిజంలో డాక్టరేట్

- ఏయూ నుంచి పట్టా అందుకున్న శ్రీరామపురానికి చెందిన నరసింహం



రిజిస్ట్రార్ ధనుంజయరావు నుంచి డాక్టరేట్ జారీ కాపీని అందుకుంటున్న నరసింహం

లక్కవరపుకోట: ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం విభాగంలో లక్కవరపుకోట మండలం శ్రీరామపురానికి చెందిన వి.ఎస్.వి.నరసింహం పీహెచ్‌డీ చేశారు. ఏయూ ప్రొఫెసర్, ఇన్‌చార్జి వీసీ డి.వి.ఆర్.మూర్తి పర్యవేక్షణలో 'ఉత్తరాంధ్రల టెలివిజన్ జర్నలిస్టుల వృత్తిపరమైన పాత్ర–అవగాహన, వృత్తిపరమైన ప్రమాదాలు, ఉద్యోగ సంతృప్తి' అనే అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎస్.ధనుంజయరావు నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను నరసింహం స్వీకరించారు.

పోడు పట్టాలు ఇప్పించండి



డీటీ భరత్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

శృంగవరపుకోట: ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు పోడు పట్టాలు ఇవ్వాలని మండలంలోని కొండమల్లిపూడి గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో హెచ్‌డీటీ భరత్‌కుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమ భూముల్లో వ్యవసాయం చేసుకోవడానికి మౌలిక వసతులు కల్పించాలని, అలాగే గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు.

గ్రంథాలయానికి ఇన్వర్టర్ వితరణ



ఇన్వర్టర్‌ను ఏర్పాటు చేస్తున్న దాతలు

శృంగవరపుకోట: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఇన్వర్టర్ ఏర్పాటు కోసం స్థానిక డాక్టర్ ఆర్.త్రినాథరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రేవతి, రైల్వేగార్డ్ చిప్పాడ ఈశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోన దేవి రూ.30వేల ఆర్థిక సాయం చేశారు. ఈ డబ్బులతో లైబ్రేరియన్ దామోదర శ్రీధర్ ఇన్వర్టర్ కొనుగోలు చేసి గ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ ఇన్వర్టర్‌ను దాతలు ప్రారంభించారు.

చెరువు గండి పూడ్చివేత



గండి పూడ్చివేత పనులు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొండపల్లి: నెలివాడ గ్రామంలోని రాజు చెరువుకు పడిన గండిని సర్పంచ్ తాళ్లపూడి కీర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, నాయకులు రైతులతో కలిసి సోమవారం పూడ్చి వేశారు. చెరువుకు గండి పడడం వల్ల దిగువన ఉన్న వరి పంటపొలాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో ఇసుక బస్తాలను వేసి గండిని పూడ్చే పనులు చేపట్టారు.



దత్తిరాజేరు: గడసాం- పోరలి గ్రామాల మధ్యకోతబారిన రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ జయంతి

వర్షం వదిలింది... నష్టం మిగిలింది

అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం సోమవారం తెరిపిచ్చింది. దీంతో అధికార యంత్రాంగం, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భారీవర్షం వల్ల జరిగిన పంట, ఆస్తి నష్టం అంచనా వేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. గండ్లు పడిన చెరువులు, కోతబారిన రోడ్లను, నీట మునిగిన పంట పొలాలను, కూలిన ఇళ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పరిశీలించారు.

- చెరువులకు గండ్లు
- కూలిన ఇళ్లు
- నీట మునిగిన పంట పొలాలు
- కోతబారిన రోడ్లు



మెరకముడిదాం: బుధరాయవలసలో వరదనీటి ప్రవాహంతో పత్తి చేనులో వేసిన ఇసుక మేట



శృంగవరపుకోట: ఎస్.కోటలో రాజుచెరువును పరిశీలిస్తున్న అధికారులు



శృంగవరపుకోట: సంతగవిరమ్మపేట స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు భోజనాలు పెడుతున్న అధికారులు



మెరకముడిదాం: ఎం.రావివలసలో వరి పంట పొలాల్లోకి చేరుతున్న వరదనీరు



జామి: జామిలో నెలకొరిగిన బొప్పాయి తోట

పాఠశాలలోకి వరద నీరు

శృంగవరపుకోట: మండలంలో గత రెండు రోజులు కురిసిన వర్షాలకు చెరువులు నిండుకుండల్లా మారాయి. మరింత వర్షం కురిస్తే చెరువులు, గెడ్డలకు గండ్లు పడి పంట పొలాలు నీటమునగడంతో పాటు రోడ్లు కోతబారేవి. తిమిడి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో కి వరదనీరు చేరింది. పాఠశాల ప్రాంగణం అంతా ఇంకా మోకాలిలోతు నీటిలో ఉంది. సంతగవిర మ్మపేటలోని కాజ్‌వేపైకి వరదనీరు చేరింది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు కాజ్‌వే పైనుంచి నీరు పారడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఎస్.కోట పట్టణంలోని జీసీసీ రోడ్డులో సలాది వెంకటలక్ష్మికి చెందిన పెంకుటిల్లు వర్షాల ధాటికి కూలిపోయింది. ఆలుగుబిల్లి గ్రామంలో పీత దేముడుకి చెందిన ఇల్లు పాక్షికంగా, వీర నారాయణంలో ఒక కోళ్లఫారం పాక్షికంగా దెబ్బతిన్నట్టు రెవెన్యూ అధికారులు నిర్ధా రించారు. ఎస్.కోటలో రాజుచెరువును తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ శేషుబాబుతో కలిసి ప్రత్యేకాధికారి మురళీకృష్ణ పరిశీలించారు. అనంతరం సంతగవిరమ్మపేటలోని ప్రాథమికోన్నత పాఠశాల, వెల్ నెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న వారికి భోజనాలు వడ్డించారు. అధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వర కు పునరావాస కేంద్రాలను విడిచి వెళ్లొద్దని చెప్పారు. బాధితులకు భోజనాలు ఏర్పాటు చేసిన గ్రామపెద్దలు, సత్యసాయి ట్రస్ట్ వారికి అధికారులు ధన్యవాదాలు తెలిపారు.

ఓ చోట గండి కొట్టారు.... మరో చోట పూడ్చారు

చీపురుపల్లి: రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు చెరువులు నిండుకుండల్లా తలపిస్తున్నాయి. పలు చోట్ల చెరువులకు గండి పడి పంట పొలాల్లోకి నీరు వస్తుండగా మరికొన్ని చోట్ల చెరువుల నుంచి నీరు నివాసాల్లోకి రాకుండా ఉండేందుకు స్వచ్ఛందంగా గండి కొట్టాల్సి వస్తోంది. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని లావేరురోడ్‌లో గోరువాని చెరువు నిండి పోవడంతో ఏ క్షణంలోనైనా గండిపడి నివా సాల్లోకి నీరు పొంగే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని స్థానికులు ద్వారా తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ పంచాయతీ సిబ్బందిని వెంటపెట్టుకుని వెళ్లి గోరువాని చెరువుకు గండికొట్టించారు. దీంతో ఆ చెరువు పరిసరాల్లో నివాసితులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే మేజర్ పంచాయతీ పరిధిలోని జి.అగ్రహారంలో తుఫాను కారణంగా దెబ్బతిన్న కల్వర్టుల ను వంశీకృష్ణ పరిశీలించారు. నాగంపేటలో కూలిన పాఠశాల ప్రహరీ, నీట మునిగిన పంట పొలాలను ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు పరిశీలించారు. యలకలపేట గ్రామ పరిసరాల్లో చాకలివాని చెరువు గండికొట్టి పంట పొలాల్లోకి నీరు వస్తుండడంతో గ్రామస్తులే గండిని పూడ్చుకున్నారు.

ఇంకా ముంపులోనే పంట పొలాలు

బొండపల్లి/మెరకముడిదాం/ జామి: బొండపల్లి, మెరకముడిదాం, జామి మండలాల్లో వరి పంట ఇంకా ముంపులోనే ఉంది. బొండపల్లి మండలంలోని బోడసింగిపేటలో చలి చెరువుతో పాటు, బొండపల్లి రామన్న సాగరంచెరువు, నెలివాడలోని రాజు చెరువు, కొవ్వాడపేటలోని చెరువులు కింద ఆయకట్టు వరి పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. వరినాట్లు వేసి కొద్దిరోజులు మాత్రమే కావడంతో నీట మునిగిన పంటను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. మెరకముడిదాంలో వెదుర్లు చెరువు పూర్తిగా నిండి సర్ప్లస్‌పై నుంచి పారుతున్న వరదనీరుతో చెరువు దిగువభాగంలో ఉన్న వరిపంట మునిగిపోయింది. ఎం.రావివలసలో వాగు పొంగడంతో వరి పంట పొలాలు మునిగాయి. బుధరాయవలస గ్రామంలో పత్తి పంట పొలాలు మీదుగా వరద నీరుపారడంతో పొలాల్లో ఇసుక మేటలు వేసింది. జామిలో బొప్పాయి, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. జామి మండలంలోని అలమండలో ఒక పూరిల్లు, తాండ్రంగిలో ఒక పెంకుటిల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తాటిపూడి జలాశయం నుంచి నీరు విడుదల చేయడంతో గోస్తనీ నది పరవళ్లు తొక్కుతోంది. దీంతో భీమసింగి కాజ్‌వేపై నుంచి రాకపోకలను అధికారులు నిషేధించారు. కాజ్‌వేను తహసీల్దార్ కృష్ణలత పరిశీలించారు.

నిలిచిన రాకపోకలు

దత్తిరాజేరు: మండలంలోని బోజరాజపురం- దత్తి గ్రామం మధ్యలో ఉన్న గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గడసాం - పోరలి మధ్య తారు రోడ్డు మూడుచోట్ల కొతబారడంతో ఆగ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్లు ,భవనాలశాఖ డీఈ రవి కిరణ్, ఇరిగేషన్ డీఈ పాండు, ఏఈ నరసింహరావు, పెదమానాపురం ఎస్‌ఐ జయంతి కలిసి రోడ్డును పరిశీలించారు. వరద నీటి ప్రవాహం తగ్గిన వెంటనే రోడ్డు మరమ్మతులు చేపడతామని డీఈ రవి కిరణ్ తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను గుర్తించి, మరమ్మతులు చేపడతామని వివరించారు.

ఆదుకోవాలి

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట న్యూకాలనీకి చెందిన కోరాడ సురేష్ పెంకిటిల్లు ఆదివారం సాయంత్రం కూలిపోయింది. పాత శ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన ఆవాల రాముకు చెందిన పూరిల్లు గోడ కూలిపోయింది. రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

- మండలంలోని ఎస్.లింగాలవస గ్రామంలో ఏడొంపుల గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గెడ్డలో ఉన్న రక్షిత మంచినీటి పథకం ట్యాంకు మునిగి పోయింది. దీంతో తాగునీరు అందక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

వరదనీటిలో గంగిరెడ్లపేట

గుర్ల: మండలంలోని గంగిరెడ్లపేట గ్రామంలోని ఓ కాలనీని వరద నీరు చుట్టుముట్టింది. వరద నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ కార్యదర్శి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కాలనీని పరిశీలించారు.

అనంత చెరువుకు గండి

వేపాడ: మండలంలోని నల్లబిల్లి గ్రామ సమీపంలో ఉన్న అనంత చెరువుకు గండిపడింది. దీంతో సుమారు 25 ఎకరాల్లో వరిపంట నీట మునిగింది.



శృంగవరపుకోట: తిమిడి ఉన్నత పాఠశాలలోకి చేరిన వర్షపునీరు



బొండపల్లి: బోడసింగిపేటలో నీట మునిగిన వరి పంట



శృంగవరపుకోట: సంతగవిరమ్మపేట కాజ్‌వేపై పారుతున్న వరదనీరు



చీపురుపల్లి: నాగంపేటలో కూలిన పాఠశాల ప్రహరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు



చీపురుపల్లి: చీపురుపల్లి మేజర్ పంచాయతీలో గోరువాని చెరువుకు గండి కొట్టిస్తున్న బెల్లాన వంశీకృష్ణ



చీపురుపల్లి: యలకలపేటలో చాకలివాని చెరువుకు పడినగండిని పూడ్చుతున్న గ్రామస్తులు



గుర్ల: గంగిరెడ్లపేటలోని కాలనీలోకి చేరిన వరద నీటిని పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు



దత్తిరాజేరు: గడసాం- పోరలి మధ్య కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న డీఈ రవికిరణ్



జామి: రామయ్యపాలెంలో నీట మునిగిన వరిపంట



గజపతినగరం: పాతశ్రీరంగరాజపురంలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న వీఆర్ఓ



దత్తిరాజేరు: బోజరాజపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను దాటుతున్న రైతులు



గజపతినగరం: లింగాలవలస వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఏడొంపుల గెడ్డ



వేపాడ: నల్లబిల్లి గ్రామంలో అనంత చెరువుకు పడిన గండి

నీట మునిగిన పంట పొలాల పరిశీలన



గంట్యాడ: రామవరం గ్రామంలో నీటమునిగిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు తేజేశ్వరావు, త్రివేణి



మెరకముడిదాం:ఎం.రావివలసలో వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రావణితేజ



దత్తిరాజేరు: గడసాంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



గజపతినగరం: మధుపాడ గ్రామంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ ధనలక్ష్మి



జామి: రామయ్యపాలెంలో పంటపొలాలను పరిశీలిస్తున్నఏడీఏ విజయ, ఏఓ కిరణ్‌కుమార్

దత్తిరాజేరు: వర్షాలకు గడసాం గ్రామంలో నీట మునిగిన వరి పంటను గజపతినగరం వ్యవసాయ శాఖ ఏడీఏ మహారాజన్, విజయనగరం రైతు శిక్షణ కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాస్,స్వాతి, కో-ఆర్డినేటర్ లక్ష్మణ్, ఏఓ అనురాధ సోమవారం పరిశీలించారు. 75 ఎకరాల్లో పంట నీటమునిగినట్లు గుర్తించామని, వరద నీరు తగ్గిన తర్వాత ఎన్ని ఎకరాల్లో పంట దెబ్బతిన్నది నిర్ధారిస్తామని తెలిపారు.

జామి మండలంలో..

జామి: భీమసింగి, రామయ్యపాలెం తదితర గ్రామాల్లో నీట మునిగిన వరి పంట పొలాలను కొత్తవలస సబ్ డివిజన్ ఏడీఏ ఎల్.విజయ, ఏఓ కిరణ్ కుమార్ సోమవారం పరిశీలించారు. మండలంలో160 ఎకరాల్లో పంట నీట మునిగిందని, పంట పిలకదశలో ఉన్నందున పెద్దగా నష్టం వాటిల్లదని తెలిపారు.

గజపతినగరం మండలంలో..

గజపతినగరం: మండలకేంద్రంతో పాటు మధుపాడ గ్రామాల్లో వరి పంటను ఏఓ ధనలక్ష్మి సోమవారం పరిశీలించారు. 20ఎకరాల్లో పంట నీట మునిగినట్లు గుర్తించారు.పొలాల్లో నీటిని వీలైనంత త్వరగా బయటకు మళ్లించి, ఎకరానికి 20 కిలోల యూరియా, 20కిలోల పొటాష్ ఎరువును వేయాలని రైతులకు సూచించారు..

మెరకముడిదాం మండలంలో..

మెరకముడిదాం:ఎం.రావివలస, మెరకముడిదాం గ్రామాల్లో నీటిమునిగిన పంటలను ఏఓ శ్రావణితేజ సోమవారం పరిశీలించారు.పొలాల్లో నీటిమళ్లింపు,సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు.

అధిక తేమ అనర్థకం

గంట్యాడ: రామవరంలో వరి పంటను వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు కె.తేజేశ్వరరావు, యు.త్రివేణి సోమవారం పరిశీలించారు. పంటకు అధిక తేమ అనర్థకమని పొలంలో నీరు బయటకు తీసివేయాలని రైతులకు సూచించారు. వారి వెంట ఏఓ బి.శ్యామ్‌కుమార్, వీఏఏ వెంకటేష్ ఉన్నారు.

ఆర్‌ఓబీ వద్ద రాకపోకలు పునరుద్ధరణ



ఆర్‌ఓబీ వద్ద వరద నీటిని పరిశీలిస్తున్న అధికారులు



వరద నీటిని ఇంజిన్ల సహాయంతో నీటిని తోడిస్తున్న దృశ్యం

లక్కవరపుకోట: అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు సోంపురం గ్రామ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ)వద్ద వరద నీరు నిలిచి పోయింది. దీంతో శనివారం, ఆదివారం వేపాడ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. తహసీల్దార్ ప్రసాద రావు, ఎంపీడీఓ కె.రూపేష్, ఎస్‌ఐ గోపాలరావు సోమవారం అక్కడికి చేరుకుని రెండు ఇంజిన్ల సహాయంతో వరద నీటిని బయటకు తోడించా రు. ఈ పనులను మండల ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్ పర్యవేక్షించారు. వరదనీటిని పూర్తిగా బయటకు తోడేయడంతో రాకపోకలు ప్రారంభయ్యాయి.

11న ప్రజావేదిక

బొండపల్లి: మండలంలో 2023–2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి డీఆర్పీలు గ్రామాల్లో సోషల్ ఆడిట్ పూర్తిచేశారు. ఈ నివేదికలపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోఈనెల11న ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉపాధి హామీ ఏపీఓ బి. కృష్ణవేణి సోమవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, వేతనదారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

సర్వసభ్య సమావేశం రేపు

కొత్తవలస: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల11వ తేదీన ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పద్మజ సోమవారం ఓప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, మండల అధికారులు, సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నరవ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

గంట్యాడ: నరవ గ్రామ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పతివాడ అప్పలనారాయణమ్మను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఇటీవల విచారణ చేపట్టారు. విచారణలో అభియోగాలు నిర్ధారణ కావడంతో తాజాగా అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు.

నదిలో నుంచి రాకపోకలు సాగించొద్దు



చంపావతినదిని పరిశీలిస్తున్న అధికారులు

గజపతినగరం: మండలంలో మర్రివలస గ్రామం వద్ద చంపావతి నదిని మండల ప్రత్యేక అధికారి రమేష్, ఎంపీడీఓ కిశోర్ కుమార్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ జనార్ధనరావు, పంచాయతీ కార్యదర్శి పార్థు సోమవారం పరిశీలించారు. మర్రివలసతో పాటు శిడగంవలస, యర్రాడవలస, పనుకువలస, మల్లేడు వలస, ఎస్.ఎల్.వలస తదితర గ్రామాల ప్రజలు నదిలో దిగి రాకపోకలు సాగిస్తుంటారు. నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఆయా గ్రామాల ప్రజలు మరో నాలుగైదు రోజులు నదిలో నుంచి రాకపోకలు చేయవద్దని ప్రత్యేక అధి కారి సూచించారు. అయితే ఇప్పటికే మూడు రోజులుగా బయటకు వెళ్లే దారి లేక ఇళ్లలోనే తల దాచుకున్నామని, నిత్యావసర సరుకులు లేక ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



స్వర్ణోత్సవ సంబరాల్లో యూటీఎఫ్ నాయకులు

గజపతినగరం: స్థానిక బాలుర హైస్కూల్‌లో గజపతినగరం నియోజకవర్గస్థాయి యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను సోమ వారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రికెట్, చెస్, కబడ్డీ, క్యారమ్ ఆటల పోటీలను యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.ఈశ్వరరావు ప్రారంభించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఈశ్వరరావు తెలిపారు. ఉత్సవాల్లో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అల్లు శంకరరా వు, రాష్ట్ర కౌన్సిలర్ కె.అప్పారావు, సీపీఎస్ సబ్ కమిటీ పి.రామ్‌ప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు జీ.వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.